క్లుప్తంగా

తెనాలిలో నేడు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

తెనాలిఅర్బన్: మాస్టర్ మైండ్స్ ఆధ్వర్యంలో సీనియర్ ఇంటర్‌లో 950 మార్కులపైనా సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నేడు (ఆదివారం) ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వయిజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 950 మార్కులు పైన సాధించిన విద్యార్థిని విద్యార్థులు ఆధార్‌కార్డు, కాలేజ్ ఐడీ కార్డు, మార్కుల జాబితా (ఇంటర్‌నెట్‌కాపీ) తీసుకురావాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం సెలనంబర్: 9248722218, : 7780390139 నంబర్‌లో సంప్రదించాలన్నారు. పురస్కార సర్టిఫికెట్‌తో పాటు నగదు బహుమతిగా ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తెనాలిరూరల్: స్థానిక కొత్తపేటలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా నెల రోజుల పాటు తెనాలి మండలంలో నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీపీ చెన్ను బోయిన శ్రీనివాసరావు, ఎంపీడీఓ విజయాలక్ష్మణ్, తహసీల్దార్ కె రవిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామ స్థాయిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకే అధికారులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, గృహసారధులు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తెనాలి మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ లతో రెండు బృందాలుగా షెడ్యూల్ రూపొందించినట్లు చెప్పారు.

ఆశ్రమాల్లో వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ

తెనాలిటౌన్: గాంధీనగర్‌లోని షిరిడి సాయి ఆశ్రమం, నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో శనివారం వృద్ధులకు అన్నదానం చేశారు. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు మైనేని రాజేంద్రప్రసాద్ జ్ఞాపకార్థం భార్య ఉషారాణి కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య ప్రారంభించారు. ఆశ్రమాల్లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగ సభ్యులు శేషగిరిరావు, గీతాదేవి, అనూష, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, మురళి, భారతి, వజ్రాల రామలింగాచారి, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొలనుకొండ, కృష్ణా కెనాల్ స్టేషన్ల మధ్య శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తెల్లచొక్కా ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రాథమికంగా భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మానవ మెదడు పనితీరుపై పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: మానవ మెదడు సంక్లిష్టమైన అవయవమని, మెదడును అర్థం చేసుకోవడం అంటే సొంత ఆరోగ్యాన్ని అర్థం చేసుకోవడమేనని కేఎల్ విశ్వవిద్యాలయం చైర్మన్ కోనేరు సత్యనారాయణ అన్నారు. శనివారం విశ్వవిద్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రొ చాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ వైద్య రంగంలో మానసిక ఆరోగ్యం పెను సవాల్‌గా మారిందని అన్నారు. ఆగస్టు 21 నుంచి 25 వరకు జరిగే ఐదు రోజుల కార్యశాలకు వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వసుజాదేవి కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా ఎస్.ఇ.ఆర్.బి. సైన్స్, టెక్నాలజీ విభాగం వారి సహకారం అందించనున్నారని వివరించారు. కార్యక్రమంలో యువ పరిశోధకురాలు సౌమ్య, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చిలువూరులో బకింగ్‌హామ్ కెనాల్‌పై ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా పాత బ్రిడ్జి కూల్చివేత పనులను శనివారం చేపట్టారు. కెనాల్ దాటేందుకు గతంలో నిర్మించిన ఫుట్‌బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)కి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు నిధుల నుంచి రూ.45 లక్షలు కేటాయించడంతో వెంటనే పాత బ్రిడ్జిని తొలగించి కొత్త బ్రిడ్జి నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్కే చొరవ చూపడం పట్ల చిలువూరు గ్రామస్తులు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్బీకే సేవలతో వ్యవసాయం

- వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలకు విస్తృత సేవలు
- కొల్లిపర మండలంలో 21 గ్రామాల్లో 15 ఆర్‌బీకే కేంద్రాలు
- 8,031 మంది రైతులకు సేవలు
- 8000 హెక్టార్లలో సేద్యం



రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ పై ట్రాక్టర్, యంత్రాలు తీసుకుంటున్న రైతులు



సబ్సిడీ పై జీలుగ విత్తనాలు తీసుకుంటున్న రైతు

కొల్లిపర: మట్టిని నమ్ముకున్న రైతన్నలు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రానికి వచ్చి క్యూలలో గంటల తరబడి నిరీక్షించినా ఒక్కోసారి అందని పరిస్థితి. చివరకు అనేక ఇబ్బందులతో పంటలు పండించినా ఆసమయానికి గిట్టుబాటు ధర లభించక దళారుల పాలయ్యేది. ఒకానొక దశలో రైతులు క్రాప్ హాలిడేను ప్రకటించిన దయనీయమైన పరిస్థితులు, మరోవైపు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు , యంత్రాలను రైతుల పేరిట నమోదు చేసి తరువాత పచ్చనేతలే హాంఫట్ చేయడం ఇదంతా టీడీపీ పాలన నాటి రైతుల పరిస్థితి. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ దురవస్థలకు చెల్లుచీటీ పాడేలా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రతి రెండు వేల జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రం ఏర్పాటుతో మేలైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు మొదలైనవన్నీ రైతుల ముంగిటకే చేర్చింది. ఈ సంస్కరణలు, జవాబుదారీతనంతో అందిస్తున్న సేవలు తమకు వ్యవసాయంపై భరోసానిచ్చేలా ఉంటున్నాయని మండల వ్యాప్తంగా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

కొల్లిపర మండలంలో రైతు భరోసా కేంద్రాలు ఇలా

మండలంలో 20 గ్రామ పంచాయతీలుండగా ,15 రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అత్తోట 1 వల్లభాపురం 1,2 ,మున్నంగి 1,2 పిడపర్రు 1, కొల్లిపర 1,2,3 అన్నవరం 1, బొమ్మువానిపాలెం 1, చివలూరు1, తూములూరు 1, దావులూరు 1, చక్రాయపాలెం 1, ఉన్నాయి. మండలంలో ప్రధానంగా వరి, జొన్న, మొక్కజొన్న, కూరగాయలు, అరటి, పసుపు ఎక్కువగా పండిస్తున్నారు.

15 కేంద్రాలాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎరువులు ఇలా

యూరియ, డిఎపి, కాంప్లెక్స్	215టన్నులు
జొన్నలు	2 క్వింటాలు,
పిల్లి పెసర	8క్వింటాలు
జీలుగ	3.5క్వింటాలు

ఆర్‌బీకేలతో రైతులకు అందుతున్న సేవలు....

రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్, పశుసంవర్ధశాఖ, ఉద్యానవన శాఖ సిబ్బంది కూడా వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. రైతులకు ఎరువులు, విత్తనాలు , యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, రొటోవేటర్లు, స్ప్రేయర్లు వంటి వివిధ వ్యవసాయంతో అనుభందం ఉన్న వాటిని సబ్సిడీపై ఇస్తోంది.

- ప్రతి నెల మొదటి శుక్రవారం ప్రతి ఆర్‌బీకేలో రైతులతో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహిస్తారు, ఆనెలలో వారికందివ్వాల్సిన సేవలపై చర్చించి ప్రాధాన్యత క్రమంలో నిర్దేశించుకుంటారు. రెండవ శుక్రవారం మండల స్థాయిలో ఈ సమావేశాలు నిర్వహిస్తారు.

15 ఆర్బీకేల్లో నాలుగేళ్లలో పంపిణీ చేసినవి ఇలా....

యూరియ, డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు	4397.595 టన్నులు
వరి , పచ్చిరొట్టి విత్తనాలు	180క్వింటాలు
ఏర్పాటైన కస్టం హైరింగ్ గ్రూపులు	15
వైఎస్సార్ యంత్ర సేవా పథకం ట్రాక్టర్లు 1	4
వైఎస్సార్ రైతు భరోసాతో రైతులు పొందిన లబ్ధి	47.29కోట్ల
మొత్తం రైతుల సంఖ్య	8,031
వైఎస్సార్ ఉచిత పంటల భీమా	4918 మంది రైతులు
వైఎస్సార్ ఉచిత పంటల భీమా సొమ్ము	8.9కోట్ల
ఇన్‌పుట్ సబ్సిడీ 12వేల 489 మందిరైతులకు	11కోట్ల 70 లక్షలు
సున్నావడ్డీ పథకంలో 4వేల 670 మందిరై తులకు	90 లక్షలు
వరి, మొక్కజొన్న, జొన్న , పసుపు పంటల కొనుగోలు	
740 మంది రైతులకు గాను	రూ.15 కోట్ల 30 లక్షలు

- ప్రతి మే నెలలో మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్షలు చేయించడమే కాకుండా ఆ రిపోర్టు ఆధారంగా వాడాల్సిన ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తారు.
- ఇంటిగ్రేడ్ కాల్ సెంటర్ 155251 టోల్ ఫ్రీ నంబరుతో రైతులకు వ్యవసాయ సమాచారం తెలుసుకునే వెసులుబాటు తీసుకొచ్చారు.
- ప్రస్తుతం ప్రతి ఆర్‌బీకేలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగలను 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నారు.
- రైతుల పొలాల్లో పీఎం కిసాన్ కింద ఈ-క్రాప్ నమోదు చేస్తారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం వాటిల్లితే రైతులకు రోజుల వ్యవధిలో నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో పరిహారం అందేలా చూడడం జరుగుతుంది
- ఆర్‌బీకే కేంద్రాలల్లో పంటలకు గిట్టుబాటు వచ్చేలా ప్రభుత్వమే కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించారు.

ధైర్యంగా సేద్యం చేస్తున్నాను



నాకు రెండెకరాల పొలం ఉంది. మా ఊరి నుంచి కొల్లిపర మండల కేంద్రానికి 10కిలో మీటర్లు రావాలి. ఇంతకుముందు (టీడీపీ పాలనలో) ఎరువులు, విత్తనాల కోసం చానా ఇబ్బందులు పడినా, ఇప్పుడు ఆ బాధలు వేవు.మా ఊర్లోనే రైతు భరోసా సెంటరు పెట్టినారు. నేరుగా ఆర్బీకే కేంద్రానికి పోతా తెచ్చుకుంటా... నేను రైతు గ్రూపు ద్వారా ట్రాక్టరు పొందినాను..

ఆళ్ళ సాంబిరెడ్డి , వల్లభాపురం

సేద్యానికి దన్ను



ఒకప్పుడు రైతులకు ఇచ్చే వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు టీడీపీ నాయకులే పంచుకునే వారు. రైతులకు అవి అందేవికాదు. ఇప్పటి ప్రభుత్వం రైతు గ్రూపులను ఏర్పాటు చేసి ఆ గ్రూపులకు వ్యవసాయ పనిముట్లును ఇస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతులు ఎంతో మేలు చేస్తున్నారు.

భీమిరెడ్డి శివరామకృష్ణారెడ్డి , మున్నంగి

మా ఊళ్లోనే విత్తనాలు, ఎరువులు



మాకు ఎకరం సొంత పొలంతో పాటు 9ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. గతంలో కొల్లిపర, తెనాలి వెళ్లి విత్తనాలు, ఎరువులు తెచ్చుకునే వాళ్లం, ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మా గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇస్తున్నారు.ఎరువులు కావాలంటే అర్డర్ పెట్టి తెప్పించి ఇస్తున్నారు.

జొన్నల వీరారెడ్డి , చివలూరు

లాభసాటిగా వ్యవసాయం



ఆర్బీకేల ఏర్పాటు, సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్ల నియామకంతో ప్రభుత్వం రైతాంగానికి ఎంతో మేలు చేస్తోంది. గతంలో పోలిస్తే రైతులు పనుల కోసం మండల వ్యవసాయ కార్యాలయానికి రావడం పూర్తిగా తగ్గింది. వారి గ్రామాల్లోనే ఆర్‌బీకేల సేవలు పొందుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకుంటున్నారు.

కె.వెంకటరావు, మండల వ్యవసాయాధికారి కొల్లిపర

'శ్రేష్ఠ' సేంద్రియ ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెటింగ్



అలెక్స్ మోర్గాన్‌తో ఎంఓయూ చేసుకున్న 'శ్రేష్ఠ' చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి. పక్కన ఇతర కంపెనీల నిర్వాహకులు

కొల్లిపర(తెనాలి): గుంటూరు జిల్లా కొల్లిపరలోని శ్రేష్ఠ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీకి, పలు అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలతో భాగస్వామ్యం కలిసింది. అమెరికా, జర్మనీ దేశాలకు చెందిన ఆయా కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. స్థిరమైన వ్యవసాయానికి కావాల్సిన టెక్నాలజీలను ఆయా కంపెనీలు అందించటమే కాదు..'సేంద్రియ పంటలు'కు గ్లోబల్ మార్కెటింగ్‌ను కల్పిస్తామని ఆయా కంపెనీల నిర్వాహకులు హామీనిచ్చారు. కొల్లిపర, పరిసరాల్లోని 300 మంది రైతుల సభ్యత్వం కలిగిన శ్రేష్ఠ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ, గత ఆర్నెల్లుగా అమెరికాకు చెందిన క్లైమైట్ సెన్స్, జర్మనీ, బెంగళూరు, హైదరాబాద్‌లో నడుస్తున్న నీయో ఆరా, ఏరో స్పెషియల్ కంపెనీలతో కలిసి పనిచేస్తోంది. ఆయా కంపెనీల సెన్సార్లు పంటపొలం గుణాలను తెలుసుకుని, అందులోని లోపాలను విశ్లేషించి నివేదిస్తున్నాయి. వాటి ఆధారంగా పంటభూమికి కావాల్సిన పోషకాలను రైతులు అందిస్తున్నారు. స్థిరమైన వ్యవసాయం కోసం ఆయా టెక్నాలజీల అవసరాన్ని రైతులు గుర్తించారు. ఫలితంగానే శనివారం 'శ్రేష్ఠ' కలెక్షన్ సెంటర్‌కు ఆయా కంపెనీల నిర్వాహకులే స్వయంగా వచ్చారు. 'క్లైమేట్ సెన్స్' ప్రెసిడెంట్ అలెక్స్ మోర్గాన్, 'నియో ఆరా' వ్యవస్థాపకుడు లంకిరెడ్డి నీలేష్‌రెడ్డి, 'ఏరో స్పెషియల్' కంపెనీ వ్యవస్థాపకుడు నరేష్ వాసంశెట్టితో 'శ్రేష్ఠ' చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, డైరెక్టర్లు ఎంవోయూలను కుదుర్చుకున్నారు. వీకే హోల్డింగ్స్ భాగస్వాములు గ్రెగ్ వాల్ష్, ఫణి కర్రా, రిలయన్స్ రిటైల్స్ స్టేట్ హెడ్ రఘురామ్‌రెడ్డి పాల్గొన్నారు. సభకు విశాఖకు చెందిన 'అగ్రిడీఎస్‌ఏ' నిర్వాహకుడు నరేంద్రరెడ్డి అధ్యక్షత వహించారు. రైతులకు తగిన గుర్తింపు, ఆదాయాన్ని ఇవ్వాలనేది తమ ఆశయంగా అలెక్స్ మోర్గాన్ చెప్పారు. సేంద్రియ విధానంలో పండించిన పంటలకు గ్లోబల్ మార్కెటింగ్ చేస్తామని చెప్పారు. ఇందుకోసం అమెరికా/యూరోప్‌లో అనేక కంపెనీలున్నట్టు చెప్పారు. రైతులు తమ టెక్నాలజీ సహకారంతో స్థిరమైన వ్యవసాయం చేయాలని స్పష్టంచేశారు. నీలేష్‌రెడ్డి తన ప్రసంగంలో రైతుల భూముల్లో కొన్ని సెన్సార్లను ఏర్పాటు చేస్తామని, అవి భూమి గుణాలను సేకరించి 'క్లౌడ్'కు పంపిస్తే, భూమి లక్షణాలను విశ్లేషిస్తోందని చెప్పారు. వాటి ఆధారంగా భూమి ఆరోగ్యంగా ఉండేలా చూసుకుంటూ సాగుచేసుకోవచ్చని చెప్పారు. టెక్నాలజీ ఆధారంగా చక్కని సాగు పద్ధతులతో పండించిన పంటలకు గ్లోబల్ మార్కెట్‌లో విక్రయాలకు అవకాశం కల్పిస్తామని గ్రెగ్ వాల్ష్, ఫణి కర్రా హామీనిచ్చారు. నరేంద్రరెడ్డి మాట్లాడుతూ కంపెనీ సభ్యుల్లో ఏటికేడాది సేంద్రియ సాగువిధానాన్ని పెంచుకుంటూ, అంతర్జాతీయ టెక్నాలజీలతో స్థిరమైన వ్యవసాయం చేస్తూ భవిష్యత్‌లో రైతులకు రెట్టింపు ఆదాయాన్ని తీసుకురావాలనేది తమ లక్ష్యమన్నారు. సభలో సేంద్రియ రైతులకు ప్రశంసాపత్రాలను అతిథులచే అందజేశారు. 'శ్రేష్ఠ' డైరెక్టర్లు దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొంతు గోపాలరెడ్డి, ఉయ్యూరు సాంబిరెడ్డి, నెర్ల జ్యోతి పర్యవేక్షించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు కల్లం శివరామిరెడ్డి, అవుతు వెంకటేశ్వరరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు. తొలుత'శ్రేష్ఠ' సభ్యులు సాగుచేస్తున్న వెదురుసాగు, స్రేందియ నిమ్మ సాగు తోటలను సందర్శించారు. అక్కడి సెన్సార్లు పనిచేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఏరో స్పెషియల్ కంపెనీ డ్రోన్ పనితీరును చూశారు

'జగనన్న ఆణిముత్యాలు'కు బహుమతుల ప్రదానం



పదవ తరగతిలో ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

అన్నవరపులంక(కొల్లిపర): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో విద్యను ఆయుధంగా చేసుకుని ఎదగాలని అన్నవరపులంక గ్రామ సర్పంచ్ తోడేటి రాజేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని అన్నవరపులంక గ్రామంలోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహం కింద నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ టి.శ్రీనివాస్ , ప్రధానోపాధ్యాయులు టి.మల్లేశ్వరరావు, కమిటీ ఉపాధ్యక్షుడు సువర్ణలక్ష్మి, మాజీ సర్పంచ్ రాధాకృష్ణమూర్తి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా చదివితే ప్రతి విద్యార్థి ఒక ఆణిముత్యమే

తెనాలిటౌన్: ప్రణాళికబద్ధంగా కష్టపడి చదివితే ప్రతి విద్యార్థి ఒక ఆణిముత్యమేనని కొలకలూరు గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గత ఏడాది పదో తరగతిలో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన [illegible] విద్యార్థులు పెద్దిరెడ్డి ఇందు, మల్లెల ప్రశాంతి, ఆరెమండ అభిజిత్‌లను సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు, నగదు పారితోషకాలను అందజేశారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాచర్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభలో సర్పంచ్ ప్రీతి మాట్లాడుతూ అత్యాధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆణిముత్యాలుగా పిలవడం సముచితంగా ఉందన్నారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో చేస్తున్న సంస్కరణలు పేద విద్యార్థులు ఉన్నతంగా చదవడానికి ఎంతో ప్రోత్సాహకరంగా ఉందన్నారు. ప్రతి పాఠశాలలో మంచిమార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఆణిముత్యాలుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు మత్తె అన్నారావు, మారుతీ కిరణ్, జ్యోత్స్న పద్మ, పదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ నారాయణమూర్తి మృతి



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వితరణశీలి, శ్రీ సీతారామ గానసభ అధ్యక్షుడు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పిరాట్ల నారాయణమూర్తి(75) శనివారం స్థానిక ముత్తిని శెట్టి వారి పాలెంలోని స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నారాయణమూర్తి సీతారామ గానసభ అధ్యక్షులుగా పట్టణంలో అనేక సంగీతోత్సవాలతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజలను ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపేందుకు పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనేకమంది పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తోడ్పాటునిచ్చారు. వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ శాఖీయుల అవసరార్థంగా నిర్మించిన బ్రాహ్మణ అపరకర్మల శాల నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయటమే కాకుండా, ఇతర దాతల ద్వారా తోడ్పాటును ఇచ్చారు. నరసరావుపేటలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వేద పాఠశాల నిర్మాణానికి భూరి విరాళాన్ని అందించారు. ఆయన అంత్యక్రియలు సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నారాయణమూర్తి మృతి పట్ల వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. సమాఖ్య అధ్యక్షుడు అమ్మని సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి, కోశాధికారి దక్షిణామూర్తి, భాగవతుల కామేశ్వరరావు, ఆమంచి రాంబాబు, తాడేపల్లి నాగ సుబ్రహ్మణ్యం , భీమవరపు సత్యనారాయణమూర్తి, ఇతర సభ్యులు, అర్చక సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.అనంతాచార్యులు, అఖిలభారత అర్చక ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మేడూరు శ్రీనివాసమూర్తి, వైఖానస సేవా సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి తమిరిశ రఘు, శ్రీ వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ ఉపాధ్యక్షుడు నారాయణం వేణుగోపాల్ నారాయణమూర్తి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

- తల్లి, మారు తండ్రి చంపారంటున్న బంధువులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఓ విద్యార్థి అనుమానాదాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై శనివారం తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడు ఉరి వేసుకోలేదని, తల్లి, మారు తండ్రే చంపి ఉరివేశారంటూ బాలుడు సాగర్‌దాస్ చరణ్ (12) మేనమామ పిల్లి సుధీర్ ఆరోపిస్తున్నాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లి సాగర్ సౌజన్య, కనకయ్యలకు 14 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమారుడు(సాగర్‌దాస్ చరణ్). రోడ్డు ప్రమాదంలో కనకయ్య మృతి చెందాడు. అప్పటి నుంచి సాగర్‌దాస్ అమ్మమ్మ తాతయ్యల దగ్గర ఉంటున్నాడు. సాగర్ సౌజన్య విజయవాడలో హోంగార్డుగా పనిచేస్తూ కొలనుకొండలో నివాసముండే జోషి నాగేశ్వరరావును రెండో వివాహం చేసుకుంది. వివాహం అనంతరం కొలనుకొండలో నివాసముంటున్నారు. ఏడో తరగతి పూర్తిచేసిన చరణ్ చుండూరులోని హాస్టల్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోగా సీటు లభించింది. స్టడీ సర్టిఫికెట్ అవసరమై మూడు రోజుల కిందట తల్లి సాగర్ సౌజన్య వద్దకు వచ్చాడు. సౌజన్య, నాగేశ్వరరావులు బయటకు వెళ్లిన సమయంలో బాలుడు తల్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి ఫిర్యాదు చేయగా, బాలుడి మేనమామ పిల్లి సుధీర్ మాత్రం తల్లి, రెండో భర్త చంపి ఉరివేశారని ఆరోపిస్తున్నాడు. ఈ సంఘటనపై అనుమానాదాస్పద కేసుగా నమోదు చేశామని, పోస్టుమార్టం అనంతరం వాస్తవాలు నిర్ధారిస్తామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు చెందిన బాలుడు రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం కంఠంరాజు కొండూరుకు చెందిన దాసరి దివ్య, రాజులకు తరుణ్ (11) కుమారుడు. పంట పొలంలో కలుపు తీసేందుకు కంఠంరాజు కొండూరు నుంచి రాజు తన సొంత ఆటోలో కూలీలతోపాటు భార్య దివ్య, కొడుకు తరుణ్‌ను ఎక్కించుకుని వెళుతున్నారు. కంఠంరాజు కొండూరు వద్దకు రాగానే తరుణ్ ఆటో స్టీరింగ్‌ను పక్కకు తిప్పి బ్రేక్ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ముందు కూర్చున్న తల్లి, కూలీలు పక్కకు పడిపోగా తరుణ్ ఆటో కింద పడ్డాడు. రాజు వెంటనే కిందకు దిగి ఆటోను లేపి [illegible] 108 సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి వచ్చి [illegible] బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. గ్రామస్తులు తరుణ్ మృతదేహంపై పడి కంటతడి పెట్టారు.

ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి

అధికారులు, సిబ్బందికి డీఎస్పీ సూచన



తెనాలిరూరల్: ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని డీఎస్పీ బి. జనార్దనరావు పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ పరిస్థితిని శనివారం సాయంత్రం డీఎస్పీ పరిశీలించారు. మార్కెట్ ఏరియా, మెయిన్ రోడ్డులో పర్యటించిన ఆయన అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం తెనాలి పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాతనేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. త్రీ టౌన్ సీఐ ఎస్ రమేష్ బాబుతో కలిసి డీఎస్పీ జనార్ధనరావు పాల్గొని రౌడీషీటర్లతో మాట్లాడారు. గతంలో వారు చేసిన నేరాలు, ప్రస్తుత వృత్తి, కుటుంబ నేపధ్యం తదితర వివరాలను డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఎవరినైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు అందరిపై నిఘా ఉంటుందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినా ముందుగా మిమ్మల్నే విచారించాల్సి ఉంటుందని అన్నారు. ఇక నేరాల జోలికి పోవద్దని, కుటుంబాల కోసమైనా మారి మంచిగా జీవించాలని చెప్పారు. అలాగే తెనాలి మండలంలోని రౌడీ షీటర్లకు రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాల్లో ప్రమేయం ఉందని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లీకైన గ్యాస్ సిలిండర్

తాడేపల్లిరూరల్:ఉండవల్లి అమరావతి రోడ్డులో ఓ హోటల్‌లో గ్యాస్ సిలెండర్ లీకై మంటలు చెలరేగిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద రావుల మస్తాన్ హోటల్ నడుపుకుంటూ జీవనం కొన సాగిస్తున్నాడు. శనివారం గ్యాస్ పొయ్యి మీద వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అందరూ భయంతో బయటకు పరుగు లు తీశారు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అంజాద్ గ్యాస్ బండను బయటకు తీసుకు వచ్చి మంటలను అదుపు చేశాడు.